

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

10 ఫిబ్రవరి 2026 పేజీలు : 08 మంగళవారం


# నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

## ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్వాగతం పలికారు. వర్చువల్ పద్ధతిలో సాగిన ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా నుంచి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఇది మూడవ మంత్రులు కార్యదర్శుల సమావేశమని ప్రతినెల ఈ సమావేశాన్ని నిర్వహిస్తుండగా జిల్లా, డివిజన్, మండలం, స్వర్ణ గ్రామ, వార్డు అధికారులు వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొంటున్నారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏడాదికి సంబంధించిన లక్ష్యాల సాధనకు నెలవారీ లక్ష్యాల ప్రగతిని ఈ సమావేశాలు ద్వారా సమీక్షించుకుని లక్ష్యాలను సాధించాలన్నారు. అంతేగాక రాష్ట్ర, కేంద్ర పథకాలు జిల్లాస్థాయిలో పటిష్ట అమలు, లక్ష్యాల సాధనపై సమీక్షించుకోవడం -మిగతా 2లో



# అరాచక శక్తులను ఏరివేయండి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి
- గుమ్మళ్ళదిబ్బలో బాధిత కుటుంబానికి పరామర్శ
- ఆడపిల్లలపై అన్యాయం జరిగితే.. ఉపేక్షించే ప్రసక్తే లేదు
- గుమ్మళ్ళదిబ్బలో నైట్ పెట్రోలింగ్ పెంచండి
- హైస్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

కోవూరు పంచాయతీలోని గుమ్మళ్ళదిబ్బలో మైనర్ బాలిక మృతి చెందడం దురదృష్టకరమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. గుమ్మళ్ళదిబ్బ జేఎస్ఆర్ కాలనీలోని మృతురాలి కుటుంబాన్ని కలిసి ఆమె పరామర్శించారు. మైనర్ -మిగతా 2లో

## ఎస్పీ పిజిఆర్ఎస్‌కు 146 ఫిర్యాదులు



03

## ఎన్ని అక్రమ కేసులు పెట్టినా.. భయపడలేదు



08 పేజీలో

# లడ్డులో నెయ్యే లేదు..

## వైసీపీకి నీతి లేదు

- మౌనాన్ని వీడండి.. ధర్మాన్ని కాపాడండి
- ఆత్మకూరు నుంచి కాలినడకన తిరుమల వరకు
- జనసేన నాయకుల ధర్మయాత్రలో కిషోర్ గునుకుల



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :**

తిరుమల లడ్డులో నెయ్యే లేదని, ఈ విషయంలో వైసీపీకి నీతి లేదని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుగుల అన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం జనసేన నాయకుడు చదలవాడ హరీష్, వారి సతీమణి మృదులకు పార్టీ తరఫున హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ.. ఆత్మకూరు నుంచి -మిగతా 2లో

# అయ్యా.. మా సమస్యలు పరిష్కరించండి

## కలెక్టరేట్‌కు 'క్యూ' కట్టిన అర్జీదారులు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కృష్ణకుమార్, డ్వామ పీడీ గంగా భవాని, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు, పింఛన్లకు సంబం ధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండలస్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక 'క్యూ' లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతో పాటు షామియానాలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నూతనంగా -మిగతా 2లో

# వక్ఫ్‌బోర్డ్ ఆస్తులను సంరక్షించాలి

## కలెక్టరేట్ వద్ద వైసీపీ నిరసన.. జేసీకి వినతి



నెల్లూరు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డ్ ఆస్తులను సంరక్షించాలని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ముస్లిం మైనారిటీ నేతలతో కలిసి.. నెల్లూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కోట్ల రూపాయలు విలువ చేసే వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు ఆక్రమణలకు గురి కావడం జరుగుతున్నాయని.. తక్షణమే అలాంటి వాటిని గుర్తించి.. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ఆస్తులను లాక్కోవాలని చూడడం దుర్మార్గమని, వక్ఫ్‌బోర్డు గవర్నమెంట్ ఆస్తి కాదు.. ముస్లింలకు సంబంధించిన ఆస్తిని ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనారిటీలకు చెందిన వక్ఫ్‌బోర్డు ఆస్తులను ప్రభుత్వం లాగేసుకోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రశ్నించిన వారిపై కక్షపూరితంగా కేసులు పెడుతుందని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను, ప్రశ్నించే వారిని అణచివేయాలనే ధోరణిని ఖండిస్తున్నామన్నారు. మీరు పెట్టే అక్రమ కేసులకు భయపడను, వెనకడుగు వేయనన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంతో మంది మైనారిటీలు తమ స్థలాలను స్వచ్ఛందంగా వక్ఫ్ బోర్డుకు విరాళాలుగా అందజేశారన్నారు. ఈ ఆస్తుల ద్వారా మైనారిటీలు ఆయా ప్రాంతాల్లో.. మసీదులు, మద్రాసాలు ఏర్పాటుచేయడమే కాకుండా పేద ముస్లింలకు.. సహాయం చేసేందుకు.. ఈ ఆస్తులను వినియోగిస్తున్న పరిస్థితి అందరూ చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆనం విజయ్ కుమార్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీ ఖలీల్ అహ్మద్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సిద్దిక్, నగర మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్ పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు



నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ : చట్ట విరుద్ధంగా ఇంటిలో అక్రమంగా గంజాయి దాచి ఉంచారని నమోదైన కేసులో నిందితులు అరవ రాజమ్మ, అరవ సురేఖలపై ఆరోపణలు సాక్ష్యాధారాలతో రుజువైనవందున వారికి ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు జరిమానా విధిస్తూ నెల్లూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.గీత సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరం కపాటిపాలెం ఆరో వీధికి చెందిన నిందితులు అరవ రాజమ్మ, అరవ సురేఖలు వారి ఇంటిలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్నారని ఎక్సైజ్ పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో 2022 డిసెంబర్ 13న స్పెషల్ ఎక్సైజ్ సీఐ కెపి కిషోర్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు నిందితుల ఇళ్లపై అక్రమంగా దాచిన గంజాయి కొరకు తనిఖీ చేశారు. వారి తనిఖీలలో నిందితుల ఇంటిలో 6.3 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం వారిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు సమగ్ర విచారణ అనంతరం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ రఫీ మాలిక్ వాదించారు.

# ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా ప్రవర్తించాలి

### కమిషనర్ వైఓ నందన్



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో సోమవారం ఇంజనీరింగ్, ట్రాఫిక్ విభాగం అధికారులు, ఎస్‌పిటి నెట్‌వర్క్స్, మాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరం పరిధిలోని ఏడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఉన్నామని తెలిపారు. అయితే ప్రధానంగా కొన్ని సాంకేతిక కారణాలు, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అమలు చేయలేకపోయామని తెలిపారు. అయితే అన్ని అడ్డంకులను అధిగమించి మంగళవారం నుంచి ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. అందులో భాగంగా ప్రయోగాత్మకంగా ఆరు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను చివరి దశలో పరిశీలించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. రామలింగాపురం కూడలి ప్రాంతంలో ఎల్అండ్‌టి సంస్థ పనులు జరుగుతున్న కారణంగా అక్కడ ట్రాఫిక్ వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కావున వాహన చోదకులు ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా ప్రవర్తించాలని, లేని పక్షంలో ఈ చలనాలు ఆటోమేటిగ్గా నమోదవుతాయని ప్రకటించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, ఇన్చార్జ్ సిటీ ప్లానర్ రఘునాథరావు, ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, వెంకటరెడ్డి, ఎలక్ట్రికల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముజాహిద్దీన్, ఎస్పీ నెట్‌వర్క్, మాట్రిక్స్ కంపెనీ ప్రతినిధులు యుగంధర్, రాయుడు పాల్గొన్నారు.

## నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుందని సిఎస్ విజయానంద్ పేర్కొన్నారు. అంతేగాక జిఎస్డిపి, ఆర్టీజిఎస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్ అంశాలపైన చివరగా రాష్ట్రంలో శాంతి భద్రతలపై సమీక్షించడం జరుగుతుందని సిఎస్ పేర్కొన్నారు.

## అయ్యా.. మా సమస్యలు పరిష్కరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అరాచక శక్తులను ఏరివేయండి



(మొదటి పేజీ తరువాయి)

బాలిక మరణానికి కారకులైన అరాచక శక్తులను ఏరివేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పోలీసులను ఆదేశించారు. మైనర్ బాలిక మృతికి కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని, వారికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. బాధిత కుటుంబానికి ఇప్పటికే పోలీసు రక్షణ కల్పించామని, ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా తాను బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద తక్షణమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఆడపిల్లల భద్రత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పరామర్శ అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ పిల్లలతో మాట్లాడి భద్రతపై అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు లేదా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే 112 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్ రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి యాకసిరి వెంకటరమణమ్మ, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, మండల మైనారిటీ నాయకులు జహంగీర్, జమీర్, ఫిరోజ్ పాల్గొన్నారు.

## లడ్డులో నెయ్యే లేదు.. వైసీపీకి నీతి లేదు



(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి వరకు కాలినడకన ప్రయాణం ప్రారంభించడం ఒక సాధారణ యాత్ర కాదు.. అది భక్తి, బాధ, బాధ్యత కలిసిన ధర్మయాత్ర.. అని పేర్కొన్నారు. పాదయాత్రలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి లడ్డు విషయంలో వచ్చిన వివాదాలు కోట్లాది భక్తుల మనసులను కలచివేశాయని, భక్తుల విశ్వాసం అంటే కేవలం ఒక ప్రసాదం కాదు.. అది తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక నమ్మకం, సంస్కృతి, ఆత్మగౌరవం అన్నారు. ఆ విశ్వాసం దెబ్బతింటే ప్రతి హిందువు హృదయం బాధపడుతుందని, ఇలాంటి సందర్భాల్లో మౌనం కాదు, బాధ్యతాయుతమైన స్పందనే అవసరమన్నారు. అందుకే ధర్మ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా 'సనాతన ధర్మ రక్షణ బోర్డు' ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల విశ్వాసానికి భరోసా ఇవ్వడానికి, ఆలయ వ్యవస్థల్లో పారదర్శకత తీసుకురావడానికి, సంప్రదాయాల పరిరక్షణకు ఇది కాలానుగుణమైన అవసరమన్నారు. చదలవాడ హరీష్ ఈ పాదయాత్ర ధర్మంపై ఉన్న నిబద్ధతకు ప్రతీక అని, ఇది ఎవరి మీద వ్యతిరేకత కాదు.. ఇది మన విశ్వాసాన్ని కాపాడుకోవాలనే ఆవేదన అన్నారు. ధర్మాన్ని రక్షించడమంటే ఇతర మతాలను దూషించడం కాదని, మన సంప్రదాయాన్ని గౌరవంగా నిలబెట్టుకోవడమేనన్నారు. జనసేన పార్టీ ఎప్పుడూ భక్తుల పక్షాన నిలుస్తుందని, శాంతియుతంగా, చట్టబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో మన స్వరాన్ని వినిపిస్తామన్నారు. భక్తుల విశ్వాసం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, భక్తిని, బాధను, బాధ్యతనీ ముందుకు నడిపిస్తూ.. తిరుమలకు జనసేన నాయకులు పాదయాత్ర చేపట్టారన్నారు. దేశంలో పాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, చుక్క పాలు లేకుండా సుమారు 60 లక్షల లీటర్ల నెయ్యి తయారు చేసి రికార్డు సృష్టించిన అపరమేధావి జగన్‌రెడ్డి అన్నారు. ఈ యాత్ర విజయవంతం కావాలని, స్వామివారి ఆశీస్సులు చదలవాడ హరీష్‌కు లభించాలని ప్రార్థించారు.

# ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 146 ఫిర్యాదులు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో 145 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదు లపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పిసిఆర్ సీఐ భక్తవత్సవ రెడ్డి, మహిళా స్టేషన్స్ సీఐ సుబ్బారావు, ఎస్బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

▸▸నెల్లూరు రూరల్ పరిధికి చెందినటువంటి మహిళ, తన కొడుకుకు ఇన్స్టాగ్రామ్ ద్వారా చక్రధర్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయమై, తర్వాత తీయబోయే సినిమాలో హీరో పక్కన తమ్ముడి క్యారెక్టర్ ఇప్పిస్తానని నమ్మించి 1,06,000 నగదు తీసుకొని, ఎటువంటి సినిమాలో ఛాన్స్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, మోసపోయానని, న్యాయం చేయాలని కోరారు.

▸▸బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి మహిళ, మరికొంతమంది వద్ద, నెల్లూరుకు చెందిన విజయ్ శాంసన్, ప్రతాప్, మధు అనే వ్యక్తులు, ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి 15 లక్షల వరకు నగదు తీసు కొని ఉద్యోగం ఇప్పించ కుండా నగదు తిరిగి ఇవ్వ కుండా ఇబ్బంది పెడు తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.

▸▸కలిగిరి పరిధికి చెందిన వృద్ధురాలిని, తన కోడలు, మనవడు, తనను బాగా చూసుకుంటానని చెప్పి, తన ఇల్లు, పొలము రాయించుకొని, ఇప్పుడు ఇంటి నుండి తరిమి వేశారని, తనకు జీవనాధారం కూడా కష్టంగా ఉందని, విచారించిన న్యాయం చేయాలని కోరారు.

▸▸కోట పరిధికి చెందినటువంటి వ్యక్తిని, హైదరాబాద్‌కు చెందిన కూటికొండ రామకృష్ణ అనే వ్యక్తి, దుబాయ్‌కి పంపి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, తన వద్ద 4,50,000/- నగదు తీసుకొని, దుబాయ్ కి విజిట్ వేసా కింద పంపించి, అక్కడ ఉద్యోగం కూడా లేదని, వీసా గడువు అయిపోయిందని చెప్పి తిరిగి ఇంటికి వచ్చేసానని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

▸▸విడవలూరు పరిధికి చెందినటువంటి మహిళ యొక్క కుమారుడు 30.10.2025 నుండి కనిపించడం లేదని, విడవలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, లోతుగా దర్యాప్తు చేసి తన కుమారుని ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

▸▸బాలాజీ నగర్ పరిధికి చెందిన మహిళను, తన భర్త, అత్తమామలు, ఆడపడుచు కలిసి నన్ను, నా పిల్లల్ని ఇంట్లోకి రానివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, అదేవిధంగా నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ యొక్క భర్త అత్తమామలు వేధిస్తున్నారని, తన పిల్లల్ని కూడా చూడనీయకుండా వాళ్ల వద్ద ఉంచుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

# బీసీ సింహ గర్జనను జయప్రదం చేయండి : బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీసీవై పార్టీ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఫిబ్రవరి 22వ తేదీ జరిగే సింహగర్జన గోడపత్రిక ఆవిష్కరణ మినీ బైపాస్ గల సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు బాయ్ పూలే విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా బీసీవై పార్టీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. ఈనెల 22న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణం నందు బీసీ సింహ గర్జన కార్యక్రమానికి బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ నిర్ణయించిన ఈ సింహగర్జన కార్యక్రమాన్ని సంబంధించి ఈరోజు గోడపత్రిక ఆవిష్కరణ పూలే విగ్రహాల వద్ద చేశారు. ఈ సింహగర్జన కార్యక్రమాన్ని జిల్లాలో ఉండే 36 మండలాల్లో, పట్టణాల్లో, నగరాల్లో ఉండే బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీస్ కుటుంబాలకు కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం నుండి బీసీలకు రావాల్సిన వాటాను తెలియజేస్తూ ప్రతి కుటుంబాన్ని కరపత్రాల ద్వారా కలుస్తూ వీధి సమావేశాలు గ్రామ సమావేశాలు మండల సమావేశాలు జిల్లా సమావేశాలు జరుపుతూ ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమానికి హాజరయ్యే విధంగా కార్యక్రమాన్ని జయప్రదం చేస్తామని ఆయన అన్నారు. ఈ సింహగర్జన ప్రధానాంశాలు స్థానిక సంస్థల్లో బీసీలకు 44శాతం రాజకీయ రిజర్వేషన్ ఉండాలని, గత ప్రభుత్వాలు ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించిన బీసీ కార్పొరేషన్‌కి నిధులు కేటాయించాలని, బీసీ రక్షణ చట్టాన్ని అమలులోకి తేవాలని, రాజధాని ప్రాంతంలో బీసీలకు ఈ ఎకరాలు భూ కేటాయింపులు చేయాలని ప్రధాన అజెండాగా చెప్పకు వచ్చారు. అనంతరం పీఏసీ సభ్యులు ఎస్ఎస్ యాదవ్ మాట్లాడుతూ.. జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ పిలుపుమేరకు బీసీలకు రాజకీయంగా ఆర్థికంగా ఎనకబడిన వర్గాలను కలుపుకొని ఈ కార్యక్రమంలో గడపగడపకు కార్యక్రమాన్ని తెలియజేసి వేల సంఖ్యలో గుంటూరులో జరిగే కార్యక్రమానికి తరలివచ్చే విధంగా పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీవై పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సోమ గోపాల్, బీసీ పార్టీ రాష్ట్ర కో కన్వీనర్ లీలా కృష్ణ యాదవ్, నెల్లూరు జిల్లా బీసీవై పార్టీ యూత్ కన్వీనర్ పాములూరు హరినాథ్, కో కన్వీనర్ కొణిదెల నాగేంద్ర, బీసివై పార్టీ జిల్లా కోకన్వీనర్ బొడ్డు రమేష్, బీసీ పార్టీ జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు సోమా అనురాధ, బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ బొమ్మి నాగ కిషోర్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పలమల శ్రీహరి, నవచైతన్య బీసీ ఐక్యవేదిక నాయకులు ఆకురాతి మనీంద్ర, సోమ పురంధర్, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జానపాటి రామసుబ్బయ్య, వడ్డెర సంఘ నాయకులు వల్లెపువెంకటేశ్వర్లు, సంక్రాంతి వెంకటేశ్వరరావు, కువ్వకొల్లు వెంకట్రావు, కందల పెంచలయ్య, అవ్వారు వెంకట శేషయ్య, గారా వెంకట రమణయ్య, వల్లెపురత్నం, సెల్వరాజ్, మల్లికార్జున, ధోనిపర్తి వెంకటేష్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మూర్ఛ రోగుల కోసం టోల్ ఫ్రీ నంబర్ ప్రారంభం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ ఎపిలెప్సీ (మూర్ఛ వ్యాధి) దినోత్సవం సందర్భంగా నెల్లూరు నారాయణ హాస్పిటల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొని, రోగుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్: 1800-424-0060ను ఆవిష్కరించారు. ఎపిలెప్సి డే సందర్భంగా వైద్య విద్యార్థులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మూర్ఛ వ్యాధిపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, రోగుల పట్ల మానవత్వంతో స్పందించాలని కలెక్టర్ కోరారు. మూర్ఛ వ్యాధిపై సందేహాల నివృత్తికి, చికిత్సా పద్ధతులపై అవగాహన కల్పించడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ నిరంతరం అందుబాటులో ఉంటుంది. మందులతో నయం కాని మూర్ఛ వ్యాధికి శస్త్రచికిత్స అందుబాటులో ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ సదుపాయం కేవలం నారాయణ హాస్పిటల్‌లోనే ఉందని వైద్యులు తెలిపారు. 'మూర్ఛకే జీవితం పరిమితం కాదు' అనే అంశంపై వైద్యులు, విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం ఎపిలెప్సి రోగులకు మానసికంగా




ఎలా మద్దతివ్వాలి, మూర్ఛ నుంచి స్వేచ్ఛ ఇవ్వడం, మూర్ఛకే జీవితం పరిమితం కాదు అనే అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, న్యూరాలజీ విభాగం హెడ్ డాక్టర్ సంపత్ కుమార్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ రావులపల్లి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సేల్ ఎనర్జీ కంపెనీకి జాతీయ అవార్డు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** అతి పెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి దారులలో ఒకటైన ఎస్ఈఈఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ప్రతిష్టాత్మకంగా జాతీయ పవర్స్ జన్ వాటర్ మేనేజ్మెంట్ అవార్డు అందుకునింది. థర్మల్ పవర్ రంగంలో స్థిర మైన జల నిర్వహణ కృషి చేసిన వారికి మూడు ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు అందించారని సేల్ కంపెనీ యాజమాన్యం తెలిపింది. బి.శ్రీనివాస్ హెడ్ ఆపరేషన్ సపోర్ట్ అండ్ అసెట్, తిరుమురుగన్ కృష్ణన్ మేనేజర్ అవార్డులను ఢిల్లీలో అందుకున్నారని సేల్ కంపెనీ శాఖ వారు తెలిపారు. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహా పాత్ర మాట్లాడుతూ.. సేల్ కంపెనీ వారు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత వహిస్తూ దాదాపు 12లక్షల చెట్లను నాటి పచ్చదనాన్ని పరిశుభ్రతను అవలంబిస్తుందని అన్నారు.

## వెలుగు చూపడమే అన్నిటికంటే గొప్పది



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మనిషికి వెలుగును ప్రసాదించడమే అన్నిటికంటే గొప్పదిగా భావించిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు ఆలోచించి పేద ప్రజలకు కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వెలుగును ప్రసాదించాలని వీపీఆర్ నేత్ర వాహనాన్ని సమకూర్చే కంటి వెలుగును ప్రసాదిస్తున్నారు అందులో భాగంగా సోమవారం వింజమూరులోని నడిమూరు నందు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి సీనియర్ నాయకులు వని పెంట వెంకటసుబ్బారెడ్డిలు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని మండలాల పేద వర్గాలకు చెందిన కంటి రోగులను గుర్తించి వారికి వెలుగును ప్రసాదించాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు ఎంతో గొప్ప మనసుతో ఇంతటి కార్యక్రమాన్ని చేపట్టడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావించాలన్నారు. కంటి చూపు కరువైతే ఎలాంటి దృశ్యాలను కూడా మనం చూడలేమని తెలిపారు. కావున ఎలాంటి కార్యక్రమాలను చేపట్టి కంటి చూపును ప్రసాదించే వారిని మనం ఎల్లవేళలా ఎన్నంటి ఉండాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో సుమారు 420 మంది కంటి రోగులు హాజరుగాక వారిని పరీక్షించి సుమారు 190 మందికి కళ్ళజోళ్ళను అందజేశారు ఈ కార్యక్రమంలో గణపం సుదర్శన్ రెడ్డి ఎమ్మెస్ నాయుడు కోడూరు నాగిరెడ్డి నాయుడు కటకం ప్రసన్నకుమార్ తిరుపత ఆచారి చేజర్ల భాస్కర్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి ఇతర నాయకులు తదితరులు ఉన్నారు.

## బకింగ్ హోమ్ కెనాల్‌పై ఆక్రమణలు తొలగించండి

- కేంద్రం చేపట్టే జలరవాణాకు సహకరించండి
- బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం జాతీయ జల రవాణాను ప్రారంభించాలని ఆదేశించింది. నెల్లూరు జిల్లాలో బకింగ్ హోమ్ కెనాల్ ఆక్రమాలు తొలగించలని బి కెనాల్ డీఈ విజయ్ కుమార్ రెడ్డికి బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. 1973 సంవత్సరం వరకు నెల్లూరు జిల్లాలో జల రవాణా బకింగ్ హోమ్ కెనాల్ ద్వారా జరిగింది. 1990 తర్వాత ఆక్వా కల్చర్ రంగప్రవేశంతో సముద్రం ముఖద్వారాలను వాగులు నది ముఖద్వారాలను ఆక్రమణ చేశారు. కెనాల్‌పై ఉన్న తొమ్మిది లాకులు శిథిలావస్థకు చేరాయి. చిప్పలేరు ఉప్పుటేరు కండలేరు వాగుల ముఖద్వారాలు పూడ్చేశారు. 60 అడుగుల కాలువ ఆరడుగుల పరిధిలోకి తగ్గింది. ముత్తుకూరు-చిలుకూరు మండలంలో కండలేరు క్రీక్‌ను కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం పుడ్చేసింది. ఒక కిలోమీటర్ ఇంతనానికి 25 టన్నుల సరుకు రోడ్ మార్గంలో రవాణా అవుతుంది. ఒక లీటర్ ఇంధనానికి 105 టన్నుల సరుకు జల రవాణాలో జరుగుతుంది. కెనాల్పై ఆక్రమణల తొలగిస్తే భూసేకరణ అవసరం లేకుండా జలర ఆక్రమణలు తొలగించిజల రవాణాను పునరుద్ధరించాలని బిజెపి డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కందికట్ల రాజేశ్వరి పద్మావతి. నరాల సుబ్బారెడ్డి, అల్లూరు నాగేంద్ర సింగ్, కంచర్ల నారాయణ యాదవ్, రాధారెడ్డి. నారాయణ, ప్రభాకర్ యాదవ్, కేశవ టి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గోపన్నపాలెం గ్రామానికి మహర్దశ

## 50 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని అప్రోచ్ రోడ్డు నుండి గోపన్నపాలెం గ్రామంలోకి 50లక్షల రూపాయల పంచాయతీరాజ్ శాఖ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారికంగా సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు మునగాల తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సమర్థ నాయకత్వం, సహకారంతో కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న అనేక గ్రామాలకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ నిధుల ద్వారా రోడ్ల నిర్మాణాలకు మంజూరు చేస్తూ, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతోందని పేర్కొన్నారు. గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మరింత చేరువవుతాయని, రైతులకు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు సులభంగా తరలించే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. గోపన్నపాలెం గ్రామంలో నిర్మించిన ఈ సిమెంట్ రోడ్డు గ్రామాభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం జలదంకి పంచాయతీ పరిధిలోని కమ్మ పాలెం రోడ్డు కు 75 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. గోపన్న పాలెం గ్రామంలో ఇటీవల వంటింట్లో అగ్ని ప్రమాదానికి గురి కోలుకుంటున్నా మహిళను పరామర్శించి 25వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమశిల వైస్ ప్రెసిడెంట్ పులిగుంట మధుమోహన్ రెడ్డి, వంటేరు జయ చంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అప్పలనాయుడు, ఎంపీటీసీ కుట్టి బోయిన మాధవరావు యాదవ్, జలదంకి ఉపసర్పంచ్ కూరపాటి మాల కొండరెడ్డి, పొంకు మాల్యాద్రి యాదవ్ గోపన్న పాలెం చెరువు ప్రెసిడెంట్, మాదిరెడ్డి సుబ్బా రెడ్డి, కంచర్ల వినోద్ నాయుడు, తమ్మినేని మహేశ్వరరావు, మహీధర్ యాదవ్, బొచ్చు మల్లికార్జున యాదవ్, దేవరాల తిరుపాల్ యాదవ్, సింగమనేని మనోజ్ కుమార్ యాదవ్, వర్ధినేని మురళి, గంటా అశోక్, ఉన్నం రవి, గంటా సుబ్బానాయుడు, ఏగూరి రఘు, పచ్చా పెంచులు నాయుడు, దగు మాటి మాల్యాద్రి రెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్ రెడ్డి, రోషి రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ముచ్చలా మధుసూదన్ రెడ్డి, పులుగుంట మహేంద్రరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు తోట మురళి, నిమ్మలపల్లి రామ చైతన్య, సొసైటీ డైరెక్టర్ జానీ బాయ్,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో లీకేజీపై స్పందించిన ఆర్టీసీ జోనల్ చైర్మన్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నుంచి బయటకు వెళ్ళు మార్గంలో మున్సిపాలిటీకి సంబంధించిన వాటర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో నీటి ప్రవాహం ఆర్టీసీ బస్టాండ్ ఆవులను లోపలికి వెళ్లి ప్రజలకు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులకు బస్సులకు వ్యాపారస్తుల కు అనేక విధాలుగా ఇబ్బందులు జరుగుచున్న సమయంలో విషయం తెలుసుకున్న పాత్రికేయులు 'సూర్య' పత్రికలో ప్రచురించిన వెంటనే స్పందించిన కావలి మున్సిపల్ అధికారులు అక్కడ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించి జెసిబి తో లీకేజీ పైపును బయటకు తీయడం జరిగింది. అయితే అలా తోవ్వారు ఇలా వదిలేశారు. ఇక పట్టించుకున్న నాధుడే లేరు. ఈ విషయంపై గత రెండు రోజుల నుండి 'సూర్య' దినపత్రికలో వార్తలు ప్రచురించడంతో దీనిపై ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌ని పాత్రికేయులు వివరణ కోరగా స్పందించి, వెంటనే కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్‌తో మాట్లాడి త్వరగా లీకేజీ మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు వ్యాపారస్తులకి ఇబ్బందులు లేకుండా చూడాలని చరవాణి ద్వారా మాట్లాడి నట్లు సూర్య ప్రతినిధికి తెలిపారు. కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో పరిస్థితులపై కూడా క్షుణ్ణంగా పర్యవేక్షిస్తామని వివరించారు. ఏది ఏమైనాప్పటికీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి వారు చెప్పిన మాటలకు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ స్పందించి ఈ లీకేజీ పైపులైను మరమ్మత్తులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు, ప్రయాణికులకు, వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపడతారా.. లేక నిర్లక్ష్యంగా వదిలేస్తారా.. అనేది వేచి చూడాలి.

# పరిశ్రమల స్థాపనతో బడా కంపెనీలకు భూములు ధరదాత్తం

- ప్రాణాలైనా అర్పిస్తాం.. మా భూములను దక్కించుకుంటాం..
- పుల్లాయపల్లి పంచాయతీ ప్రజల ఆందోళన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మెట్ట ప్రాంతంలో ఉన్న అరెకరా, ఎకరా పొలంలో వర్షాధాంగా పంటల సాగు చేసి జీవనం సాగిస్తున్నాం. అలాంటి భూములను పరిశ్రమల స్థాపన పేరుతో బడా కంపెనీలకు అప్పగిసా మంటే చూస్తూ ఊరుకోం.. ప్రాణాలైనా అర్పించి భూములను దక్కించుకొంటామని మండలంలోని పుల్లాయపల్లి పంచాయతీ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. తమ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్లు 100, 106లోని 312.24 ఎకరాల భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ పరిశ్రమ స్థాపనకు రిలయన్స్ సంస్థకు అప్పగించడంపై రైతు సంఘం ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలతో కూడిన ఆందోళన చేపట్టారు. వారు తొలుత రంగనాయకులస్వామి ఆలయం నుంచి మెయిన్ బజార్ గుండా తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయా సర్వేనెంబర్లలో 1992లో అప్పటి కావలి ఆర్డీవో వాణిశంకర్ 242 మంది పేదలకు సీజేఎఫ్ఎస్ కింద పట్టాలు మంజూరు చేసిం దన్నారు. పంచాయతీలో అన్ని గ్రామాల ప్రజలు ఆ భూములను అవసరాలకు వాడుకుంటున్నారు. ప్రస్తుతం పం చాయతీలో వంద కుటుంబాల వారు సెంటు భూమి లేని వారు ఉన్నారన్నారు. అలాంటి పరిస్థితుల్లో పేదలకు పట్టాలు పంపిణీ చేసిన భూములను రిలయన్స్ కంపెనీకి అప్పగించడం దారుణమన్నారు. పరిశ్రమ పేరుతో ఆ భూమిని అప్పగిస్తే ఇక తమ గ్రామంలో ప్రభుత్వ అనాధీనం, మేతపోరంబోకు భూముల్లేవని. ఉన్నదంతా రిజర్వు ఫారెస్టేనన్నారు. పంచాయతీలో మూగజీవాలు బతకాలన్నా, రాబోయే రోజుల్లో అర్హులకు భూములు పంపిణీ చేయాలన్న ఆ భూములే దిక్కన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఆ భూములను పరిశ్రమల స్థాపనకంటూ' ఇస్తే మూగజీవాళ పరిస్థితి ఏమిటని ప్రశ్నిచ్చారు. అనంతరం వినతిపత్రాన్ని డీటీకి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, కృష్ణ, కే.నరసింహారెడ్డి, కొండా రాజగోపాల్ రెడ్డి, కే.భాస్కర్ రెడ్డి, కల్లూరి రమణారెడ్డి, దేవసాని సుధాకర్ రెడ్డి, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ సస్పెన్షన్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సీతారామపురం పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్గా విధులు నిర్వహిసు న్న నల్లిపోగు జ్యోతిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉదయగిరి ఎస్ఐ-2, సీతారామపురం ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆల శ్రీను సోమవారం తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా విలేఖరుల సమావేశం నిర్వహించి ఉదయగిరి సీఐ వెంకటరావుపై నిరాధారమైన ఆరోపణలు చేయడంతో క్రమశి క్షణ చర్యల కింద ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఉత్వర్వును జ్యోతికి అందజేసినట్లు ఆయన తెలిపారు.

## వార్డు సమస్యలపై స్పందించిన అధికారులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసన రావడం, వీధిలైట్లు వెలగకపోవడం తదితర సమస్యలపై స్థానిక టీడీపీ నాయకులు మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా మురళి, కమిషనర్ బాలకృష్ణల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై స్పందించిన కమిషనర్ వెంటనే తమ సిబ్బందితో డ్రైనేజీ లోని చెత్తను తొలగింపజేసి, వీధిలైట్లను పునరుద్ధరించారు. దీంతో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసిన నాయకులు సందాని, సుబహాని, అక్తర్ భాయ్, అల్తాఫ్, హనీఫ్ లను వార్డు ప్రజలు అభినందించారు.

## కిమ్స్‌లో అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. మూర్ఛ వ్యాధిపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. మూర్ఛ అనేది ఒక నాడీ సంబంధిత సమస్య మాత్రమేనని, సరైన చికిత్సతో బాధితులు సాధారణ జీవితం గడపవచ్చని వైద్యులు వివరించారు. మూర్ఛ వచ్చినప్పుడు నోటిలో వస్తువులు పెట్టకూడదని, బాధితుడిని సురక్షితంగా పక్కకు తిప్పి పడుకోబెట్టాలని సూచించారు. వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వైద్య సిబ్బంది చిన్న నాటకం ద్వారా ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా పోస్టర్లు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. మూర్ఛ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా, వారిని ఆదరించాలని కిమ్స్ వైద్యులు, యాజమాన్యం ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ సి.కృష్ణమోహన్, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ వి.అభినయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తరగతి గదులు, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్ర అధ్యాపకులు షేక్ షఫీ ఉల్లా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని యాదవపాళెం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణాత్మక పరీక్షలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థు లకు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రతి విద్యార్థి తరగతికి తగ్గట్టుగా సామర్థ్యాలు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామసుబ్బమ్మ. ఉపాధ్యాయుడు జాఫర్ మోహిద్దీన్ పాల్గొన్నారు.

## జూడో క్రీడల్లో ద్వితీయ బహుమతి పొందిన పి.కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయి జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్‌లో డిసెంబర్ 21, 22 తేదీలలోజరిగిన క్రీడల్లో జూడో గేమ్లో డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు పి.కావ్య వి.శ్రావణి పాల్గొన్నారు. పి.కావ్య 57 కేజీల బరువు విభాగంలో జూడో క్రీడల్లో రెండవ స్థానం విజయం సాధించడం జరిగిందని నెల్లూరు జూడో అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ జి.మురళి తెలిపారు. క్రీడాకారులు ఉద్దేశించి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ దాంశెట్టి బాల సురేష్‌బాబు, కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వానికికే కాకుండా మానసిక క్రమశిక్షణకు ఎంతో దోహదపడతాయని జూడొవంటి యుద్ధ కళలు ఆత్మ రక్షణకు చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టివి రావు కళాశాల ఏఓ జి.రమేష్ బాబు, డిప్లొమా కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్వి రమణయ్య, దామోదర్ రెడ్డి, కళాశాల పీడీ దాసరి శివసాగర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శినీ కలిసిన కల్లయ్య

**కావలి, మేజర్‌న్యూస్ :** టీడీపీ సీనియర్ నాయకులు రాష్ట్ర ఎరుకల హక్కుల సంఘం నాయకులు మొగలి కల్లయ్య సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు అయిన బీద రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలసి శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం కొద్దిసేపు కావలి నియోజకవర్గ రాజకీయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

# జవహర్ నవోదయలో ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ కృష్ణాపురంలో సోమవారం ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రేరణ కార్యక్రమం మినిస్ట్రీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ, మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయ కృష్ణాపురంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాల స్థాయిలో ముందుగా ఎంపిక కాబడ్డ ఒక బాలిక, ఒక బాలుడు మొత్తం 35 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమైన అంశం వికసిత్ భారత్,మై కాంట్రిబ్యూషన్ టు నేషన్, ఆత్మ నిర్భరత్ కార్యక్రమాలు ప్రధాన అంశాలుగా ఉన్నాయి. వ్యాసరచన, కథారచన, చిత్రలేఖనం, గానం అంశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మర్రిపాడు మండల విద్యాశాఖ అధికారి ఈ.ధనలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పోటీ తత్వాన్ని అలవరచు కోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అంశాలైన స్వాభిమానం, శౌర్యం, సాహసం, పరిశ్రమ సమర్పణ, కరుణ, సేవ, వివిధత, ఏకత ఈ అంశాలను అలవర్చుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి వచ్చిన విద్యార్థిని



విద్యార్థులలో ఇద్దరిని ఎంపిక చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చదివిన గుజరాత్ లోని వాద్ నగర్ కు పంపించడం జరుగుతుంది. వారు అక్కడ ఒక వారం రోజులు పై అంశాలపై శిక్షణ తీసుకొని విలువలతో కూడిన పౌరులుగా ఎదుగుతారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జ్ కె.పార్వతి ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణా జిల్లా, ఉపాధ్యాయులైన మాధవరావు, ప్రసాద్, ఉషా ప్రభ, జేమ్స్, లీనా, బాలకృష్ణ, చెన్నయ్య, వెంకటరెడ్డి ఇతర ఉపాధ్యాయులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కే.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 42 అర్జీలు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పాల్గొని అర్జీ దారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరూ 300 చ.అ ఉచిత టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటీసులు ఇచ్చినప్పటికీ గృహాలకు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా స్వాధీనం పొందని టిడ్కో గృహాలను అర్హులైన ఇతరులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా అందజేస్తామని కమిషనర్ ప్రకటించారు. 365 చ.అ, 430 చ.అ టిడ్కో గృహాల కోసం దరఖాస్తు చేసుకొని సంబంధిత సచివాలయలో గాని నెల్లూరు నగరపాలక సంస్థలోని హౌసింగ్ విభాగాన్ని సంప్రదించాలని కమిషనర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 17, టౌన్ ప్లానింగ్ 05, రెవెన్యూ 04, ఇంజనీరింగ్ 14, పబ్లిక్ హెల్త్ 01, ఆప్కాస్ 01, మొత్తం 42 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ దినేష్, పట్టణ ప్రణాళికా విభాగం ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రఘు నాథ రావు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రహ్మదేవి శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బ్రహ్మదేవి గ్రామంలో ఈనెల 15వ తేదీన మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బండి శాంతయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని రాష్ట్ర ప్రభుత్వ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో కామాక్షి తాయిసమేత కైలాస నాధేశ్వర ఆలయంలో ఒకరోజు ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ వంశపారపర్య ధర్మకర్త కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేశారు. ప్రాతః కాలం మూడు గంటల నుంచి కామాక్షి తాయి కైలాస నాధేశ్వర స్వామి, కామాక్షి తాయి అమ్మవార్లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పులకాపు, సూక్తపూర్వక కళాశాభిషేకం పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కీర్తిశేషులు కొత్తపల్లి శ్రీనివాసులు జ్ఞాపకార్థంగా చందనాలంకార మహోత్సవం జరుగుతుందని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేర్కొన్నారు. సాయంత్రం పూలంగి సేవ, సర్వదర్శనం, అర్చనలు, మంగళ హారతి, మనోనివేదన, తీర్థ ప్రసాద వినియోగము జరగనున్నాయి. కామాక్షి తాయిసమేత కైలాస నాధేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా చేస్తామని ఆయన అన్నారు. ఉభయ కర్తలగా డి.హరిప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ మెట్టా



చంద్రశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన తనయుడు మెట్టావిష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. నందిసేవ గ్రామోత్సవం, లింగోద్భవకాల సందర్భంగా విశేష పూజలు చేస్తారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహణ సాగనుంది. ఆలయంలో ప్రసాద వినియోగం ఉభయకర్తలగా కొత్తపల్లి రమేష్ కుమార్, కొత్తపల్లి మధుసూదన శాస్త్రి, కొత్తపల్లి సురేష్, కొత్తపల్లి సాయివెంకట సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి మురళీకృష్ణ, కొత్తపల్లి మహేష్ కుమార్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

# వైసీపీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కోటమిట్టలో 42వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మైనారిటీ నగర అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్, ఆధ్వర్యంలో కార్యకర్తలతో జై జగన్ నినాదాలతో.. హోరెత్తించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం



వైసీపీ కార్యకర్తలతో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని.. కార్యకర్తల్లో జోష్ నింపారు. నగరంలోని 42, 43 డివిజన్‌లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమానికి జగన్మోహన్ రెడ్డి అనేక కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని అన్నారు. మళ్లీ ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని ప్రజలందరూ ఆకాంక్షిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం జనరల్ సెక్రెటరీ ఖలీల్ అహ్మద్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు షేక్ సిద్ధిక్, మైనార్టీ నేతలు యస్థాని, రమీజా, మీరా మొహిద్దీన్ పాల్గొన్నారు.

## చిత్రకారుడు గుర్రం శ్రీనాథ్‌కు 'గోల్డెన్ స్ట్రోక్' అవార్డు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అమలాపురం ప్రాంతం కాట్రేనికోన లోని 'క్రియేటివ్ హార్ట్స్' సంస్థ అధినేత అంజి ఆకొండి సారథ్యంలో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన 'మాస్టర్ స్ట్రోక్స్ - ఎడిషన్ 5' జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ నెల 6, 7, 8 తేదీలలో మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, కేరళ వంటి 7 రాష్ట్రాల నుండి సుమారు 80 మంది ప్రఖ్యాత చిత్రకారులు తమ కళాఖండాలను ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలు, సామాజిక అంశాలను ప్రతిబింబించేలా ఉన్న చిత్రపటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన 40 మంది చిత్రకారులకు 'గోల్డెన్ స్ట్రోక్ అవార్డు'లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు గుర్రం శ్రీనాథ్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు.

## రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 19 గోమతి నగర్ ప్రాంతం డంరో షో రూమ్ వెనుక ప్రాంతంలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణంలో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, రోడ్డు వెడల్పు, దూరం తదితర అంశాలను కమిషనర్ కొలతలు వేసి పరిశీలించారు. అభివృద్ధి పనుల నిర్మాణం నాణ్యతతో జరిగేలా సంబంధిత విభాగం అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఫాజిల్, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మునిసిపాలిటీ పరిధిలోని కట్టుబడి పాలెంలో నూతనంగా నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)లో జరుగుతున్న పనులను మునిసిపల్ కమిషనర్ డి.బాలకృష్ణతో కలిసి మునిసిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హాస్పిటల్లోని పలు విభాగాలను గూర్చి కమిషనర్ చైర్‌పర్సన్‌కు వివరించారు. అలాగే స్థానిక బెజవాడ గోపాల్‌రెడ్డి పార్క్ సమీపంలో నూతనంగా నిర్మితమవుతున్న మునిసిపల్ కార్యాలయ భవన పనులను కూడా చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాచూరి సత్యం, కత్తి నాగరాజు, టిడిపి నాయకులు పి.మహబూబ్ బాషా, ఏఈ వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## అనుమతులు లేని భవనాలను గుర్తించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ స్థానిక 17వ డివిజన్ గుండ్లపాలెం ప్రాంతంలో సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా ఉన్న భవనాలకు సంబంధించి అసెస్మెంట్ డిమాండ్లను పరిశీలించారు. భవనాలకు సంబంధించిన నిర్మాణ అనుమతులు, ప్లాన్ తదితర దస్త్రాలను తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కొన్ని భవనాలను కమిషనర్ గుర్తించి సంబంధిత టీపీబీఓ, వార్డు ప్లానింగ్ కార్యదర్శులను వివరణ కోరారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించాలన్న కారడంతో వారికి షోకాజు నోటీసులు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టరాదని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఒక్క టౌన్ ప్లానింగ్ సచివాలయ కార్యదర్శి తమ పరిధిలోని భవనాలను వెంటనే తనిఖీ చేసి అన్ని అనుమతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పేనేటి సుధాకర్, రెవిన్యూ, శానిటేషన్, ప్లానింగ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల లడ్డుపై అసత్య ప్రచారం : క్షమాపణ చెప్పాలి : శేషయ్య

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకట శేషయ్య మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంపై చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేశారని తీవ్రంగా విమర్శించారు. సెప్టెంబర్ 18, 2024న చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు కోట్లాది వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. లడ్డు తయారీలో జంతు కొవ్వు కలిపారని చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఎన్‌డిడిబి, ఎన్‌డిఆర్ఐ సంస్థల నివేదికల ద్వారా స్పష్టమైందని గుర్తు చేశారు.నిజాలు నిర్ధారణ అయిన తర్వాత కూడా కూటమి నాయకులు తమ తప్పును ఒప్పుకోకుండా ఫ్లెక్సీలు, తప్పుడు ప్రచారాలు కొనసాగించడం సిగ్గుచేటని శేషయ్య అన్నారు. లడ్డు అంశంపై ప్రజలకు నిజాలు వివరిస్తే వైఎస్ఆర్‌సీపీ నాయకులపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యలని మండిపడ్డారు. ఈ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందా, లేక ఆటవిక



పాలన నడుస్తోందా అనే సందేహం ప్రజల్లో నెలకొందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ తమ తప్పులను సరిదిద్దుకొని కోట్లాది భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో కసుమూరు సర్పంచ్ శివ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మందల పెంచలయ్య, నరసయ్య, గోపాల్, సురేష్, మనోజ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు షాపులను కేటాయించాలి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కమిషనర్ వైఓ నందన్‌ను కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు కేటాయించిన ఐదు శాతం రిజర్వేషన్ షాపులను, 50శాతం షాపులకు సంబంధించిన అద్దెలను అమలు పరచాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థ కార్పొరేషన్ ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ దివ్యాంగులకు సంబంధించిన రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలుపరచడం లేదని తెలియజేశారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దివ్యాంగులకు కేటాయించిన షాపులను చాలా సంవత్సరాలుగా రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయలేదని అదేవిధంగా గతంలో దివ్యాంగులకు జీవో ఎంఎస్ నెంబర్ 63 ప్రకారం కేటాయించిన షాపులకు 50శాతం రాయితీని కూడా కల్పించారు. దివ్యాంగుల హక్కు చట్టం 2016 ప్రకారం ఇప్పటికైనా దివ్యాంగులకు కేటాయించిన షాపులను దివ్యాంగులకు వెంటనే కేటాయించి వారు వ్యాపార పరంగా అభివృద్ధి చెంది వారి కుటుంబాలను పోషించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వైఓ నందను కోరినట్లు ఆయన తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ 18వ తేదీ అర్హులైన దివ్యాంగులు హాజరై టెండర్లు పాల్గొనాలని చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలాజీ ఉమామహేశ్వర్ లాల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి విశేష స్పందన



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** సమస్య రహిత వాతావరణం మధ్య నాణ్యమైన నిరంతర కరెంటు సరఫరాను అందించడమే లక్ష్యంగా పెంచుకున్న ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోని దర్గా మెట్ట వద్దనున్న విద్యుత్ భవన్ స్కాడా సమావేశ మందిరంలో నెల్లూరు జిల్లాలోని 5 విద్యుత్ ఆపరేషన్ డివిజన్ల పరిధిలోని ప్రజలు, వినియోగదారుల సౌకర్యార్థం నిర్వహించిన 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమానికి జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి మొత్తం 6 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీరు కె.రాఘవేంద్రం తెలిపారు. రీడింగ్, లో వోల్టేజ్ సమస్యలు, వ్యవసాయ రంగానికి నూతన సర్వీసులు, అలాగే గృహ విద్యుత్ సర్వీసులకు టైటిల్ ట్రాన్స్ ఫర్ తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని ఈ సందర్భంగా ఎస్ఈ తెలిపారు. ప్రజలు, వినియోగదారుల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని, సమస్యలపై అందిన ఫిర్యాదుల తాలూకు వివరాలను సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లకు వెంటనే తెలియజేసి, రెక్టిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం తిరిగి ఫోటోతో సహా నివేదిక పంపించాలని ఆదేశించడం జరిగిందన్నారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యుత్ సేవల పరంగా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, నెల్లూరు టౌన్, రూరల్, విద్యుత్ ఆపరేషన్ డివిజన్లకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్.బాలచంద్ర, మన్నేపల్లి శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు తిరుపతయ్య, నరసింహారావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మేయర్ స్థానానికి నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** గిరిజనుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాల్ రాస్తుందని ఈ ప్రభుత్వానికి కాలం చల్లక తప్పదని గిరిజన నేత బాపట్ల వెంకట పతి యానాది, సీనియర్ న్యాయవాది అంబేద్కర్‌లు హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని జిల్లా కలెక్టరేట్ ఎదుట గిరిజన సంఘాల ఐక్యవేదిక చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పదో రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గిరిజన నేత బాపట్ల వెంకటపతి యానాది ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో గిరిజనులను ఒక పథకం ప్రకారంగా ప్రభుత్వం అణిచివేస్తుందని మండిపట్టారు. దీనికి నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్‌పై కుట్ర నిదర్శనం అన్నారు. గత పది రోజులుగా గిరిజన సంఘాల ఐక్యవేదిక జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. గత ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రాధేయపడిన పాలకులకు గిరిజన హక్కులను కాపాడాల్సిన బాధ్యత లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. గిరిజన మహిళకు అన్యాయం జరిగితే జిల్లా పెద్దలు నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఇకపై చూస్తూ ఊరుకోమని అవసర




మైతే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ మాకాని వెంకటేశ్వర్లు బత్తెన లక్ష్మణ శేఖర్, వెర్రి చెంచయ్య, గంధర్ల రమేష్ యాకసిరి మురళి, ఈగ శ్రీనివాసులు, తాళ్ల ఏడుకొండలు, బాపట్ల రామయ్య, చలంచర్ల శ్రీనివాసులు, చౌటూరు శ్రీనివాసులు, ఎందేటి సురేంద్ర, తలపల జయవర్ధన్ చేవూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో 'ఎస్‌పీఎస్‌ఎస్ ఎసెన్షియల్స్' శిక్షణ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పర్యాటక నిర్వహణ, గణాంక విభాగాల సంయుక్త ఆధ్వ ర్యంలో, పీఎం–ఉష నిధులతో 'ఎస్‌పిఎస్‌ఎస్ ఎసెన్షియల్స్' వారం రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డేటా విశ్లేషణ పరిశోధనలో కీలకమని, ఎస్‌పిఎస్‌ఎస్ వంటి ఆధునిక గణాంక సాధనాలు విద్యార్థుల నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంచుతాయని ఆయన తెలిపారు. ఎన్‌ఐటీ వరంగల్‌కు చెందిన డాక్టర్ అచింత్య రాయ్ రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్ మహా యాగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సీనియర్ టీడీపీ నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి నేతృత్వంలో గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోదండరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతినెల 9వ తేదీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ అధినేత లోకేష్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణీలు రక్తహీనతతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు కోదండరామిరెడ్డి ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కావలి వెంకటేశ్వర్లు, మీరా, ఫౌండేషన్ అధినేత లోకేష్, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మజా యాదవ్‌కు ఘన సన్మానం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా పెరుమాళ్ల పద్మజా యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా విరపు లలితా రామ్ ను జాతీయ అధ్యక్షుడు బొసగాని లక్ష్మయ్య యాదవ్ ఇటీవల నియమించ డంతో వారికి నెల్లూరులో సన్మాన సభను నిర్వహించారు. నెల్లూరు ఆమని గార్డెన్స్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు దువ్వూరు అరుణమ్మ, ఉడతా శైలజ యాదవ్ ఆధ్వర్యంలో పద్మజా యాదవ్, విరపు లలిత రామ్‌ను ఘనంగా సత్కరించారు. వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పద్మజ యాదవ్ మాట్లాడుతూ.. జిల్లాలో యాదవులందరినీ కలుపుకొని అఖిల భారత యాదవ సంఘంను మరింత బలోపేతం చేస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమం లో బీసీ సంఘం నేతలు, యాదవ సంఘం నేతలు పెయ్యాల అపర్ణ, విజయలక్ష్మి, కవిత, ముంగర శైలజ, ఎంసీ సుబ్రహ్మణ్యం, రాయి శ్రీకాంత్, పవన్ యాదవ్, సిద్దయ్య, రాజేష్, మన్యం రాము పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 12న చేపట్టే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకులు షేక్ నాయబస్సూల్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికుల శ్రమను దోచే విధంగా ప్రభుత్వాలు జీవోలు జారీ చేస్తుండడం దారుణమన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. వాటన్నింటిని రద్దు చేయాలని కోరుతూ చేపట్టే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, మన్నేటి మస్తాన్రెడ్డి, తిరుపతయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పోర్ట్ రోడ్డులో వ్యభిచారానికి పాల్పడ్డ ముగ్గురు అరెస్ట్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మనుబోలు మండలం వి.సత్రం పరిధిలోని అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామ ప్రవేశద్వారం వద్ద ఉన్న పోర్ట్ రోడ్డులో వ్యభిచారానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. బహిరంగ ప్రదేశంలో మహిళలతో అక్రమ కార్యకలాపాలకు పాల్పడి డబ్బులు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# కూటమి నేతల ఆరోపణలను ఖండించిన వైసీపీ నేతలు



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** పరమ పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డుప్రసాదం తయారీలో కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం తెలుగుదేశం జనసేన ఆరోపణలను మనుబోలు మండల వైకాపా శ్రేణులు ఖండించాయి. స్థానిక కోదండరాంపురం వైకాపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైకాపా టౌన్ అధ్యక్షులు ముంగర రవీంద్రరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా వైకాపా మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పరమ పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ జరిగిందని కూటమి ప్రభుత్వం తెలుగుదేశం జనసేన సంబంధించిన చేసిన ఆరోపణలను విడ్డూరంగా ఉన్నాయని మండి పడ్డారు. వైఎస్ఆర్సిపి ఇందుకు జవాబు చెప్పేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. సిట్టు సిబిఐ సుప్రీంకోర్టు ఇచ్చిన రిపోర్టు మాదిగ్గర ఉన్నాయని వాళ్ళు చేసిన ఆరోపణలకు చక్కగా బదులిస్తామని హరగోపాల్ రెడ్డి తెలిపారు. భారతదేశ చరిత్రలో సీబీఐని, సీట్ రిపోర్టును తప్పుపట్టిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం నిలిచిపోతుందని హరిగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా హరగోపాల్ రెడ్డి సిబిఐ సిట్ ఇచ్చిన రిపోర్టులను మీడియా ఎదుట చూపించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. లడ్డు తయారిలో కల్తీ ఎక్కడజరిగినట్లు నిర్ధారణ చేయలేదని వివరణ ఇచ్చారు. సుప్రీంకోర్టు కూడా చేసిన ఆరోపణలు డాక్యుమెంట్లు నిజాలు తీల్చాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సనాతన ధర్మం అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడడం ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు హిందువుల మనోభావాలను ముగ్గురు కలిసిదెబ్బ తీశారని హరగోపాల్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చూపించలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి తప్పుడు ఆరోపణ చేస్తున్నారని హరిగోపాల్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అదే సమయంలో మనుబోలు గ్రామ ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కలి యుగ దైవం దేవదేవుడైన వెంకటేశ్వర స్వామిపై అసత్య ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం విధానాలను ఎండగట్టారు. అధికారం కోసం లడ్డు లో కల్తీ జరిగిందని ప్రచారం చేసిన చరిత్ర హీనులుగా నిలిచిపోతారని చంద్రశేఖర్ రెడ్డి విమర్శించారు. సిబిఐ రిపోర్టు టిడిపి కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టని చంద్రశేఖర్‌రెడ్డి తేల్చి చెప్పారు. ఎల్లో మీడియా బోగస్ మీడియా అనేక కథనాలు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల్లో చులక నైపోయిందని తెలిపారు.సిట్ పోర్ట్ ల్యాబ్ ఛార్జిషీట్కల్తీ జరగ లేదని చెప్పినా దిగజారుడు రాజకీయాలు చేయడం ఏమి టని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. లడ్డు ప్రసాదంలో ఆవు పంది. నూనె కల్తీ జరగలేదని సిబిఐ రిపోర్ట్ ఇచ్చిందని ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. 2024వ సంవత్సరంలో చార్జిషీట్లో సిబిఐ చేల్చి చెప్పిందని చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ జీర్ణించు కోలేక విమర్శిస్తున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పైన ఆరోపణలు చేశారని తెలిపారు. గోడనుకు వచ్చిన ట్యాంకర్లను వెనక్కి పంపిన విషయాన్ని సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి గుర్తు చేశారు. దేవదేవుడి మీద నిందలు సామాన్యుడికి తెలిసిపోయిందని కచ్చితంగా మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గరపడ్డాయని చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. సుప్రీంకోర్టు మొట్టికాయ చేసిన కూటమి ప్రభుత్వానికి చంద్రబాబుకి బుద్ధిరాలేదని విమర్శించారు. ఎదురు తిరిగి ప్రశ్నిస్తే నాయకులు పైన కేసులు పెట్టడం జైలు పంపిస్తున్నా రని రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చంద్రశేఖర్ రెడ్డి ఆరోపిం చారు. మాజీ జడ్పిటిసి దాసరి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేయడంలో వెనుకబడి జగన్మోహన్‌రెడ్డి మీద నిర్మాని ఆరోపణలు చేస్తూ విమర్శించడం భావ్యం కాదని అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి మీద నీలాప నిందలు వేసి అభాసు పాలైన కూటమి నాయకులకు త్వరలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో వైకాపా టౌన్ అధ్యక్షులు ముంగర రవీందర రెడ్డి, మాజీ జడ్పిటిసి దాసరి భాస్కర్ గౌడ్, దువ్వూరు సుధాకర్ రెడ్డి, ఆవుల తులసిరామ్ యాదవ్, ఉచ్చూరు కమలాకర్ రెడ్డి, ఆవుల తులసి యాదవ్, గిద్దంటి రమణయ్య. శేషయ్య, గుంజి రమేష్. సుబ్రహ్మణ్యం కోసురు కోటేశ్వరగౌడ్ కుడుముల వెంకటరమణయ్య గౌడ్, ఒలిపి శ్రీనివాసులు, కోటి, కనిమల మల్లికార్జున్ పరిమళ శివరాం, తుపాకుల గిరి తదితరులు పాల్గొన్నారు.

# అరే నాగరాజు హత్య కేసులో ముద్దాయిలు అరెస్ట్

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామానికి చెందిన అరే నాగరాజు పెంకులు ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న రైల్వే గేట్ వద్ద గెట్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తనకు సుమారు 28 సంవత్సరాల క్రితం చిన్నగంజాం గ్రామానికి చెందిన తన మేనత్త కూతురు మాధవిని వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు సంతానం మొదటి వారు మహేష్ రెండో వారు నవీన్ మూడో వారు మనోహర్ ముగ్గురు సంతానం వారి మధ్య కొంత విభేదాలు రాగా సుమారు 10 సంవత్సరాల నుండి నాగరాజు రుద్రకోటలోని ఎస్సీ కాలనీలో తన భార్యకు చెందిన ఇంట్లో ఒక్కడే నివసిస్తున్నాడు కుటుంబ విభేదాలు కారణంగా మాధవి చిన్నగంజంలోనే తన తల్లి ఇంట్లో నివసిస్తూ కుట్టుమిషన్ పనిచేసుకుంటూ, తన ముగ్గురు పిల్లలు చదివిచ్చి పెద్ద కుమారుని వివాహం తదితర అవసరాల కోసం ఆమె అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ అప్పుల కోసం రుద్రకోట్లో తన తల్లి ఇచ్చిన ఆస్తిని అమ్మేందుకు కుమారుడు తల్లి కలిసి వాళ్ళ తండ్రి నాగరాజుతో మాట్లాడినప్పుడు తను ఒప్పుకోలేదు. అయితే తండ్రితో నవీన్ బాబు మంచిగా ఉంటూ 15 రోజులు ముందు అతని భార్య మాధవి కుమారుడు నవీన్ బాబు కలిసి నాగరాజును హత్య చేయాలని ఉద్దేశపూర్వకంగా నిర్ణయం తీసుకున్నట్లు ఒప్పుకున్నారని, పథకం ప్రకారం నవీన్ బాబు తండ్రితో సఖ్యతగా ఉండినట్లు నటిస్తూ, రుద్రకోటకు వచ్చి తన ఇంటిలో



మద్యం మత్తులో ఉన్న సమయంలో రాత్రి సమయంలో రోకలితో దాడి చేసి తండ్రి అయిన నాగరాజును హత్య చేశారు. తండ్రి శరీరంపై గాయాలు చేసి తల్లికి విషయం చెప్పి అక్కడ నుండి పారిపోయారు. పోలీసుల విచారణ వేగవంతం కావడంతో పట్టుబడతారని భయంతో మృతుడు భార్య, కొడుకు ఇద్దరు ముసుమూరు వీఆర్వో స్వచ్ఛందంగా లొంగిపోయారని విచారణలో తను చేసిన నేరాన్ని అంగీకరించారని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ వెల్లడించారు. కోర్టుకు హాజరపరిచి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో కావలి రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజీ బాబు కీలక పాత్ర పోషించారని తెలిపారు.

# టీడీపీ పరిపాలనలోనే తిరుమలకు నెయ్యి ట్యాంకర్లు

## జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి నెల్లూరు శివప్రసాద్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** టీడీపీ హయాంలోనే తిరుమల తిరుపతి దేవ స్థానం ఆవరణలోకి అనగా 2024 సంవత్సరంలో నెయ్యి ట్యాంకర్లు అక్క డికి వెళ్ళగా అక్కడ ఉన్న అధికారులు నెయ్యి నాణ్యతను ల్యాబ్‌లో పరీక్ష చేసి నాణ్యత లేదని వెనక్కి పంపడం జరిగిందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నెల్లూరు శివప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రం వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకత్వం విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి నెల్లూరు మాట్లా డారు. లడ్డులో కల్తీ జరిగిందని దర్యాప్తుకు టిడిపి ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు విచారణ చేసి ఈ నెయ్యి ట్యాంకర్ లోనే కల్తీ జరిగిందని నిర్ధారిస్తూ నివేదిక ఇవ్వలేదా అంటూ ఆయన ప్రభుత్వాన్ని అడిగారు. అదే టాంకర్లు మరల తిరుమల తిరుపతి దేవస్థానం వెళ్ళినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలోనే నెయ్యి కల్తీ జరిగిందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. శ్రీపెద్దన్న పాత్ర పోషించాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు భక్తుల మనోభావాలు విశ్వాసాలను ఇబ్బంది పెట్టాలని జిల్లా అధికార ప్రతినిధి విమర్శించారు. చంద్రబాబు పరిపాలనలోనే నెయ్యి కల్తీ జరిగిందన్నారు. దొడ్డి దారిన వెళ్లిన నెయ్యి ట్యాంకర్లలో కల్తీ లేదా అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కల్తీ పై ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భక్తులకు సమాధానం చెప్పాలని కోరారు. సిట్ అధికారులు 64 పేజీలు రూపొందించారని దాంట్లో కల్తీ ఎలా జరిగిందో స్పష్టంగా ఉందని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పేర్కొన్నారు. హిందువుల ఆరాధ్య దైవం అయినటువంటి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆగ్రహానికి చంద్రబాబు గురవుతు న్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి వెంకటసుబ్బయ్య, సర్పంచ్ ప్రతాప్, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్ భాష, వెంకటేశ్వర్లు, సమాచార హక్కు చట్టం వింగ్ అధ్యక్షుడు దేవారెడ్డి అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ కట్టా సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి, గండవరం సూరి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాలలో వర్మీకంపోస్టు యూనిట్ ప్రారంభం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళా శాలలో వర్మీకంపోస్టు యూనిట్ను సోమవారం సీఈవో డాక్టర్ జీ.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న 14 మంది విద్యార్థులు నాలుగు నెలలపాటు ఎంట్రప్రెన్యూర్షిప్ ప్రోగ్రాంలో శిక్షణ పొంది బయోఫోర్టిఫైడ్ వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని నేర్చుకున్నారన్నారు. యూనిట్ ద్వారా వర్మీకంపోస్టును విక్రియంచడం, రైతులకు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రఘునాథ్ రెడ్డి, మేనేజర్ డాక్టర్ సూర్యకృష్ణ, సీనియర్ ప్రొఫెసర్ ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచాలి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** రైతులందరికీ యూరియా డీఏపీ అందుబాటులో ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరమని బీజేపీ మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి అన్నారు. యూరియా కోసం మండల కేంద్రమైన వరికుంటపాడుకి రైతులు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ఆర్బీకే కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచితే రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ మేరకు వ్యవసాయ మండల అధికారి, సొసైటీ కార్యాలయంలో రైతు సేవ కేంద్రాలలో ఎరువులు ఏర్పాటు చేయాలని అధికారులకు అర్జీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా అధ్యక్షులు కర్నాటి ఆదినారాయణ గండిపాలెం ప్రాజెక్టు 5వ నెంబర్ శివారెడ్డి ఉన్నారు.

## జనార్దన్ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించిన కాకాణి



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం చిరమణ గ్రామానికి చెందిన సీనియర్ నాయ కులు మాజీ సొసైటీ అధ్యక్షులు కాటూరి జనార్దన్ రెడ్డి అనారోగ్య కారణంగా మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు కాటూరి జనార్దన్ రెడ్డి భౌతికకాయాన్ని సోమవారం చిరమన గ్రామంలో వారి స్వగృహంలో మాజీమంత్రి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైసిపి సీనియర్ నాయకులు అంబవరపు కోటిరెడ్డి, టీడీపీ మండల నాయకులు రాజవోలు సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు షేక్ షబ్బీర్ భాష, వైసిపి నాయకులు గూడ భాస్కర్‌రెడ్డి మండలంలోని పలు పార్టీల నాయకులు ఉన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందడి

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం నడిబొడ్డున మూలాపేటలో నున్న అత్యంత పురాతనమైన, మహిమాన్వితమైన శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధమైంది. ఈరోజు నుండి 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి ఘట్టమైన అంకురార్పణ కార్యక్రమము ఈరోజు రాత్రి 7 గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంతో స్వామివారి 13 రోజుల ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వం, ఆలయ యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈరోజు ఉదయం 10:30 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

# ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడలేదు

## వైసీపీ మాజీ మంత్రి విడుదల రజిని



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా సెంట్రల్ జైల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, వారి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని, మాజీ మంత్రి విడుదల రజనీ, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితతో కలిసి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి సోదరులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జైల్లో ఎంతో ధైర్యంగా ఉన్నారని మాజీ మంత్రి విడుదల రజిని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టిన, వైఎస్ఆర్ సీపీ నేతలు భయపడే వారు కాదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీపర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజినిలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టి, వారిని జైల్లో.. వైసీపీ నేతలు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఈరోజు కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్సిపి నేతలపై పెడుతున్నవన్ని అక్రమ కేసులని, ప్రజలందరికీ తెలుసన్నారు. రేపటి రోజున వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వస్తుంది, ఆరోజు ఇలా నియంతృత్వ పోకడలను అవలంబించిన నేతలకు, అధికారులు కచ్చితంగా చట్టపరమైన శిక్ష తప్పదన్నారు. రేపు వైసీపీ ప్రభుత్వం వస్తే కచ్చితంగా మరో రామరాజ్యం లాగా, పరిపాలన ఉంటుందన్నారు. గతంలో ఎప్పుడో.. ఎక్కడో కొన్నిచోట్ల ఒకటి, రెండు ఘటనలు జరిగి ఉండొచ్చేమో కానీ, ఈరోజు కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానం, అక్రమ కేసులు, ఇళ్లపై విధ్వంసం తప్ప మరేమీ లేదన్నారు. ఈరోజు పట్టపగలే, ప్రజలు, మీడియా అందరూ చూస్తుండగానే విజయవాడ, గుంటూరు జిల్లాలో టీడీపీ గుండాలు బరితెగించి దాడులకు దిగడం చూసామన్నారు. మారనాయుధాలు తీసుకొని, వైసీపీ నేతలపై హత్యాయత్నం చేసే పరిస్థితిని ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను ప్రజాస్వామ్యంలో ఎప్పుడైనా మనం చూసి ఉంటామా అని ప్రశ్నించారు. ఈరోజు కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు మూలంగా కొన్ని వందల మంది నిత్యం జైళ్ళకు రావాల్సి వస్తుందన్నారు. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో ఎప్పుడూ తలెత్తలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఈరోజు నమోదు చేస్తున్న అక్రమ కేసులు మూలంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాకు ఒకటే చెబుతున్నారని, ఈరోజు కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలను ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని సూచించారని తెలిపారు. వైయస్ జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యేదాకా.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎవరూ భయపడరని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోర్ట్ రోడ్డు వెలవెల

## భూములరేట్లు పతనం



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** పోర్ట్ రోడ్ సెంటర్ ఇప్పుడు వెలవెల బోతోంది. ఫ్లై ఓవర్ రాక ముందు పోర్ట్ రోడ్డు కూడలి స్థిరాస్తీ హోటల్స్. రవాణా సంబంధించిన వ్యాపారలు పులువురికి ఉపాధి దొరికేది. ఇప్పుడు ఫ్లైఓవర్ బిడ్జి నిర్మాణంతో పోర్ట్‌రోడ్డు నమ్ముకుని బతికే వ్యాపారస్తులు దిక్కులు చూస్తున్నారు. ఇక పొలాలు స్థలాలు రేట్లు అడిగేవాళ్లే లేరు. దేనికైనా కొంత కాలమే యోగమైన భోగమైనాఅని చెబుతున్నారు. 2007లో కృష్ణపట్నం పోర్టు నిర్మాణం చేశారు. మనుబోలు వెంకటాచలం మధ్యలో గురువుంద పూడి దగ్గర నుండి కృష్ణపట్నం పోర్టుకి రెండు లైన్ల రహదారి నిర్మించారు. ఈ ప్రాంతంలో భూములు రేట్లు పెరిగాయి. ఈ చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల స్థలాలు పొలాలు స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంది అలాగే గుర్తింపు వచ్చింది. హైవే పక్కన పోర్టుకు వెళ్లే మార్గాలలో పొలాలు కోట్ల రూపాయలు స్థిరాస్తి వ్యాపారం జరిగింది. స్వర్ణమాల పేరుతో పలుచోట్ల రహదారి విస్తరణ పనులు పుంచు కున్నాయి. కృష్ణపట్నం పోర్టుకి వరగలి రోడ్డు మీదగా ఎక్కువ చెన్నైకి రవాణా రాక పోకలు చేస్తున్నారు. అదే సమయంలో కృష్ణపట్నం పోర్ట్ నుండి రైల్వే మార్గంలో రవాణాకూడా పెరిగింది. దీనికి తోడు పోర్ట్ రోడ్ జంక్షన్‌గా భారీ ఫ్లైఓవర్ వంతెన నిర్మించడం ఇక్కడ స్థిరాస్తి వ్యాపారానికి శాపంగా మారింది. ఇక్కడ వంతెన కొంప ముంచిందని స్థలాలు పొలాలు ఉన్నవాళ్లు చెబుతున్నారు. పోర్ట్ రోడ్డు కేంద్రంగా మొన్నటి వరకు కల కల లాడిన సెంటర్ ఇప్పుడు వెల వెల పోతుంది. చెన్నై కలకత్తా 16 నెంబర్ జాతీయ రహదారి ఆరు లైన్ రోడ్డుగా మారితే పలు ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇప్పుడే అంచనాలు వేస్తున్నారు.

# రూ.41.33 లక్షలతో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 32, 33, 34 డివిజన్ల పరిధిలో రూ.41.33 లక్షల వేయా అంచనాలతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను సోమవారం స్థానిక కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, కరణం మంజులతోపాటు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాల్గొన్న టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు తాళ్లూరు అవినాష్, కరణం మంజుల మాట్లాడుతూ.. ప్రజా బాటలో భాగంగా ఈ ప్రాంతాలను సందర్శించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దృష్టికి స్థానిక ప్రజలు లో–వోల్టేజ్ సమస్యను తీసుకురావడం జరిగిందని, ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి.. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో లో–వోల్టేజ్ సమస్య ఉన్న ప్రాంతాలలో సమస్య పరిష్కారం దిశగా రూ 1.40 కోట్లతో 14 నూతన ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం టిడిపి నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు ఆశీస్సులతో శానసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వందలకోట్ల రూపాయల నిధులతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా భావించి పనిచేస్తున్నామని, ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు అందిస్తున్నసహాయ సహకారాలు, స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. సీఎం చంద్రబాబు సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని



అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ లు, కో క్లస్టర్ ఇంచార్జ్ లు, డివిజన్ అధ్యక్షులు, టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూ డిగ్రీ పరీక్షలు విజయవంతంగా ముగింపు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో నిర్వహించిన జనవరి 2026 మొదటి (రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ) డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు జరిగిన పరీక్షకు 15 మందిలో 14మంది విద్యార్థులు హాజరుకాగా, ఒకరు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, మీడియాకు వీఎస్‌యూ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## పన్నుల బకాయిలు చెల్లించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థకు సుమారుగా 300 కోట్లకు పైగా ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలం, అడ్వర్టైజ్మెంట్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ లను ప్రజలు సకాలంలో చెల్లించి నగర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్లు, డ్రైన్స్, పెయింటింగ్,కాలువలు వివిధ అభివృద్ధి పనులలో భాగస్వాములు కావాలని, నిర్దేశించిన సమయంలోపు పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ సూచించారు. మొండి బకాయిదారులను గుర్తించి వారికి కోర్టు ద్వారా నోటీసులు జారీ చేశామని వారిలో కొంతమంది పనులు చెల్లించారని మిగిలిన వారి నుంచి పూర్తిస్థాయిలో పన్నులను వసూలు చేసేందుకు కోర్టు వారు నిర్దేశించే సూచనల మేరకు తగు చర్యలు తీసుకోబోతున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్‌లో ఉపాధ్యాయుడి ప్రతిభ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల లీప్ క్రికెట్ టోర్నమెంట్ నందు చుంచులూరు గ్రామానికి చెందిన మర్రిపాడు ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు పోలూరు నాగరాజు అద్భుత ప్రదర్శనతో అలరించాడు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీ నందు ఎన్టీఆర్ జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 44 బంతులలో 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయ పథంలో నడిపించాడు. ఈ మ్యాచ్లో 46 పరుగుల తేడాతో నెల్లూరు జిల్లా జట్టు గెలుపొందింది. బ్యాటింగ్‌తోపాటు కీపింగ్‌లో అద్భుత ప్రతిభ చూపిన నాగరాజుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## స్వర్ణలింగేశ్వరుడి బ్రహ్మోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



**నెల్లూరు కల్చరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు నగరం మూలాపేటలోని గణేష్ ఘాట్ వద్ద వేంచేసియున్న శ్రీ స్వర్ణ లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 14, 15, 16 తేదీల్లో వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించిన అనంతరం, ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి, కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు ఆవిష్కరించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ ప్రత్యేక సహకారంతో ఈ ఏడాది శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 14 శనివారం గణపతి పూజ, కలశ స్థాపన, రుద్రాభిషేకం, నందీశ్వరునికి ప్రదోష అభిషేకం, అంకురార్పణ, ఫిబ్రవరి 15 ఆదివారం మహాశివ రాత్రి తెల్లవారుజాము నుంచే భక్తుల స్వహస్తాలతో పంచామృత అభిషేకాలు, రుద్రహోమం, సాంస్కృతిక కార్యక్రమాలు, అర్ధరాత్రి లింగోద్భవ కాల అభిషేకాలు, ఫిబ్రవరి16 సోమవారం రుద్రాక్షలతో సహస్రనామార్చన, మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ. సాయంత్రం వేళ అత్యంత వైభవంగా శివపార్వతుల తిరు కళ్యాణ మహోత్సవం, అనంతరం నగరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు జయప్రద, కనింపాటి లీల, ఏవిఆర్ మోహన్‌రావు, టి.భాస్కర్ రెడ్డి, ఆలయ అర్చకులు యశ్వంత్ కుమార్, విజయకుమార్, ఇతర భక్తులు పాల్గొన్నారు.

## సుందరేశ్వర స్వామి మహాశివరాత్రి వేడుకలు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం పాంగణం నందు గల శ్రీ మీనాక్షి సమేత శ్రీ సుందరేశ్వర స్వామి వారి 2026 మహా శివరాత్రి మహోత్సవంకు సంబంధించిన అహ్వాన పత్రికను సోమవారం నెల్లూరు రూరల్ శాసన సభ్యుల కార్యాలయం నందు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా అవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 13వ నుంచి 17వ తేది వరకు మహాశివరాత్రి ఉత్సవములు జరుగును అని తెలిపారు. 15వ తేదీ మహాశివరాత్రి నాడు రాత్రి 10 గం॥కు లింగోద్భవ అభిషేకం జరుగునని తెలియచేశారు. ఈ కార్యక్రమాలలో అలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనర్ధాన్ రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు, వేదపండితులు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితున్ని అరెస్ట్ చేసిన

# నవాబుపేట పోలీసులు



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** గత శుక్రవారం నెల్లూరు నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి ఆర్ ఎస్ ఆర్ హై స్కూల్ తడికల బజార్ సెంటర్ నందు జరిగిన జయలక్ష్మి హత్య కేసులో ముద్దాయిని అరెస్టు చేసి సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ కాల్ నందు నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ఏఎస్పీ దీక్ష వివరాలు వెల్లడిస్తూ.. ముద్దాయి తలపల కుమార్ (21) కె.పి హౌసింగ్ బోర్డ్ కాలనీ, నెల్లూరు రూరల్ నివాసి, తమతోపాటే నివాసముంటు తన తల్లిని కత్తితో పొడిచి హత్య చేసినట్లు తెలుపుతూ బండి పుష్పలత ఇచ్చిన రిపోర్ట్‌పై కేసు రిజిస్టర్ చేసి నవాబుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ముద్దాయి కొరకు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించి ముద్దాయిని సోమవారం ప్రశాంతి నగర్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా.. తల్లిదండ్రులు విడిపోయిన కారణంగా అనాధగా ఉన్న ముద్దాయిని అతని మేనత్త అయిన వృద్ధురాలు చేరదీసి తన ఇంట్లో ఉంచుకొని తన కుమార్తెతో వివాహం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మృతురాలికి ముద్దాయితో అక్రమ సంబంధం ఏర్పడింది విషయం తెలిసిన మృతురాలు భర్తతో తగాదా వేసుకోక అతనిని వదిలి సుమారు నెల రోజుల క్రితం ఆర్ఎస్సార్ హై స్కూల్ సమీపంలో అద్దె ఇంట్లో ముద్దాయితో కలిసి మృతురాలు నివసిస్తున్నట్లు, మృతురాలు ముద్దాయిని తన కుటుంబ సభ్యులతో కలవనీయకుండా చేసి చివరకు ముద్దాయి తల్లి చనిపోతే కూడా వెళ్ళనీకుండా చేసినట్లు, ఆరవ తేదీ ముద్దాయి తన పెదనాయన ఇంటికి వెళ్లాడని అతనితో గొడవ పడగా ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న ముద్దాయి విసిగి కోపంతో కూరగాయలు కోసే కత్తితో ఆమెను పొడిచి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని, ముద్దాయి ఒప్పుదల మేరకు హత్యకు ఉపయోగించిన కత్తిని మరియు దుస్తులను స్వాధీనం చేసుకొని ముద్దాయిని రిమాండ్ తరలించినట్టు నెల్లూరు టౌన్ ఏఎస్పీ దీక్ష వివరించారు. ఈ కేసు చేదనలో కీలక పాత్ర పోషించిన నవపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి వేణుగోపాల్ రెడ్డి మరియు స్టేషన్ సిబ్బంది రెహమాన్, రత్నయ్య, వేణు, గౌస్ బాషా, మస్తానయ్య, మొదలైన వారిని జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, నెల్లూరు టౌన్ ఏఎస్పి ఈ సందర్భంగా అభినందించారు.

# బిసి రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో బిసిరక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని పలువురు బిసి సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 22వ తేదీన గుంటూరులో బిసి గర్జన నిర్వహించనుండగా.. అందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆత్మకూరులో ఆవిష్కరించారు. స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిసిసంఘ నాయకులు మాట్లాడుతూ.. బిసిలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు బిసి రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 22వ తేదీన గుంటూరు-విజయవాడ మధ్యలోని నాగార్జున యూనివర్శిటీ ఎదుట బిసి గర్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. రాష్ట్రంలో బిసిలపై అగ్రవర్ణాల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈపరిస్తితుల్లో బిసిలకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టం అమలు చేయాలని వారు కోరారు. బిసివై పార్టీ అధ్యక్షుడు గోడే రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో బిసి సింహగర్జన నిర్వహిస్తామని, తొలి అజెండాగా బిసిరక్షణచట్టం అమలు, అలాగే విద్య, ఉపాధి, రాజకీయాల్లో బిసిలకు 44శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్లతో కార్యక్రమం జరుగుతుందన్నారు. రాజధాని అమరావతిలో బిసిలకు 1000ఎకరాల భూమిని కేటాయించాలని వారు కోరారు. బిసిలకు అన్యాయం జరిగేలాఉన్న 99పైసలకే భూమి ప్రతకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బిసిల సింహగర్జనకు ఆత్మకూరు నియోజకవర్గంలోని బిసిలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు పెద్దసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు వేల్పుల రామ్మోహన్, నక్కాదినేష్, లీలాకృష్ణ యాదవ్, తిప్పిరిబోయిన రమేష్, నాగేంద్ర, గాలం ఓబులేష్, పలువురు స్తానిక బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్స్‌తో ఏఎస్పీ దీక్ష సమావేశం





**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** గుంటూరు రేంజ్ ఐజి, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష నగర పరిధిలోని ట్రాన్స్‌జెండర్స్‌తో సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పీ మాట్లాడుతూ.. నెల్లూరు టౌన్‌లో నేరాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ట్రాన్స్ జెండర్స్‌ను హెచ్చరించారు. అదేవిధంగా ప్రజలతో మమేకమై శాంతియుతంగా జీవించాలని, ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రవర్తనకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరితోనూ దౌర్జన్యంగా లేదా దురుసుగా ప్రవర్తించరాదని, అంతేకాకుండా బెగ్గింగ్, ఎక్స్టార్షన్, దొంగతనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. నెల్లూరు టౌన్‌లో డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని, గంజా వంటి మాదిగ ద్రవ్యాల సేవనం లేదా అమ్మకం సహించేది లేదని, పోలీస్‌శాఖకు పూర్తి సహకారం అందించాలని, చట్ట పరిరక్షణలో భాగస్వాములుగా ఉండాలన్నారు.

అదేవిధంగా ట్రాన్స్‌జెండర్స్ వారి వివ రాలు, నైపుణ్యాల ఆధారంగా సాధ్యమైనంత వర కు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని టౌన్ ఏఎస్పి దీక్ష తెలిపారు. కార్యక్రమంలో సీఐలు చిట్టెం కోటేశ్వర రావు, వేణుగోపాల్‌రెడ్డి, వైవి సోమయ్య, శ్రీనివాస రావు, సాంబశివరావు సిబ్బంది పాల్గొన్నారు.

## మ్యాపింగ్ పేరుతో పలువురికి ఇక్కట్లు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పెన్షన్లు, రేషన్‌కార్డులు, కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మ్యాపింగ్ అనేది ఇబ్బందికరంగా మారిందని పలువురు వాపోతున్నారు. సర్వే పేరుతో కొందరు సిబ్బంది ఆయా కుటుంబాలవారిని వివరాలు అడగకుండానే వివరాలు నమోదు చేసుకొని మ్యాపింగ్ చేశారని చెబుతున్నారు. ఒక కుటుంబంలోని కుమారులు, కుమార్తెలు వివాహానంతరం ప్రత్యేకంగా ఉంటూ ప్రత్యేక రేషన్‌కార్డులు పొందినా ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉన్నా ఒకే ఇల్లుగా ఆన్‌లైన్‌లో ఈ మ్యాపింగ్ చూపుతోంది. ప్రత్యేకంగా రేషన్‌కార్డు ఉన్నా ప్రత్యేక కుటుంబంగా పరిగణించకుండా రెండు కార్డులవారికి ఇబ్బందిగా మారిందని, ఒక కార్డులో వారి ఇంటిస్థలం, విద్యుత్‌బిల్లులు అధికంగా ఉన్నా, ట్యాక్స్‌లు చెల్లిస్తున్నా మరో కార్డుదారులు కూడా రేషన్ కార్డుకు అర్హత కోల్పోతున్నారని పలువురు వాపోతున్నారు. సంక్షేమ పథకాలకు తక్కువ వేతనాలున్న అంగన్‌వాడీలు, రెవిన్యూ సహాయకులు తదితరులకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలంటూ సంక్షేమపథకాలకు అర్హత లేకుండా ఉందని వారంతా తీవ్ర ఆవేదనతో చెబుతున్నారు. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని, అంగన్‌వాడీలు, గ్రామ సహాయకులు, మున్సిపల్ కార్మికులు తదితరాల వేతనాలను పరిగణనలోకి తీసుకోవాలని, అందరికీ సంక్షేమ పథకాలందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## ఆత్మకూరులో పుర మందిరం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఒక పురమందిరాన్ని ప్రజాప్రయోజనార్థం ఏర్పాటుకు నేతలు, అధికారులు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు. ఆత్మకూరు పట్టణం గ్రామ పంచాయతీ స్థాయి నుండి 2012లో పురపాలక సంఘంగా మారి పట్టణం అభివృద్ధి చెందింది. మండల కేంద్రంగా, రెవిన్యూ డివిజన్‌గా ఉంది. పట్టణం బాగా విస్తరించింది. పట్టణంలో ఏదేని చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా అవకాశం లేక అందరూ ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వపరంగా, ప్రవేటుగా ఏదేని అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నా, ఏదేని సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, శిక్షణా తరగతులు పట్టణంలో అవకాశం లేక పట్టణానికి 3 కిలో మీటర్లలోని ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజి, ప్రభుత్వ పాలిటెక్నిక్, లేదా ఏదేని కళ్యాణమండపాల్లో నిర్వహించుకోవాల్సి వస్తుంది. కళ్యాణమండపాల్లో నిర్వహించుకోవాలంటే అధిక వ్యయంతో కూడిన పనిగా ఉంటుంది. జిల్లా ప్రభుత్వ వైద్యశాల కూడా ఆత్మకూరులో ఉండగా పట్టణం విశాలమైన రహదారులు, సెంట్రల్‌లైటింగ్, డివైడర్లతో ఉండగా ఇక్కడ ఒక పురమందిరం ఏర్పాటు అత్యంతావశ్యకంగా ఉంది. పాతపురపాలక సంఘంలో నేతాజిక్లబ్ పేరుతో ఒక భవనం ఉండగా అదికాస్తా శిధిలావస్థకు చేరుకుంది. ఆ నేతాజి క్లబ్‌నైనా పురమందిరంగా కనీస సౌకర్యాలతో, మౌళిక వసతులతో ఆధునీకరణ చేసినా పురమందిరంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి, సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన ఆత్మకూరు అభివృద్ధికి అనూహ్యంగా నిధులవరద పారిస్తున్నారు. ఆయన తలచుకుంటే పురమందిరం ఏర్పాటు తప్పకుండా జరుగుతుందని, ఆయన దృష్టి సారించాలని సర్వత్రా కోరుతున్నారు.

## మైనర్‌బాలిక మృతికి నిరసనగా క్యాండిల్స్‌ర్యాలీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు మండలం గుమ్మళ్ళదిబ్బలో ఒక మైనర్‌బాలిక మృతికి నిరసనగా ఆత్మకూరులో సోమవారం సాయంత్రం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహించారు. ఆబాలిక మృతి అత్యంత దారుణంగా ఉందన్నారు. బాలిక మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. మైనర్ బాలిక మృతి అత్యంత బాధాకరంగా ఉందని, హృదయాలను కలిచివేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా నాయకుడు యస్థాని, ఐద్వా నాయకురాలు గుల్జార్ బేగమ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టుకమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధ, అధ్యక్షురాలు కె.రమణమ్మ, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, పలువురు యువత పాల్గొన్నారు.